క్లుప్తంగా

రన్ ఫర్ జీసస్ జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న దినకర్‌బాబు

వాకాడు: వాకాడు సెయింట్ జేమ్స్ లూథరన్ చర్చి ఆధ్వర్యంలో ఈనెల 30న నిర్వహించే రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వాకాడు, కోట, చిట్టమూరు మండలాల పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వేము దినకర్‌బాబు పిలుపునిచ్చారు. గురువారం చర్చిలో రన్ ఫర్ జీసస్‌పై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. దినకర్‌బాబు మాట్లాడుతూ ప్రతి ఏడాది నిర్వహించే రన్ ఫర్ జీసస్ కార్యక్రమం వాకాడు నుంచి బయలుదేరి వయా కోట మీదుగా విద్యానగర్ వరకు నిర్వహిస్తామన్నారు. మూడు మండలాల క్రైస్తవులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ సందీప్, ఎస్‌ఐ పవన్‌కుమార్, సంఘ కాపరి ఎన్.ప్రశాంత్ బాబు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఏకొల్లుకు వాటర్ ప్లాంట్



ప్లాంట్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న ప్రతినిధులు

దొరవారిసత్రం: ఏకొల్లు గ్రామ పరిధిలోని ప్రజల దాహార్తి తీర్చేందుకు నాయుడుపేట మండలం మేనకూరు సెజ్ ప్రాంతంలోని ఇండస్ కాఫీ కంపెనీ ముందుకొచ్చింది. ఏకొల్లు గ్రామంలో వాటర్ ప్లాంట్ నిర్మాణం కోసం గురువారం స్థలాన్ని కంపెనీ ప్రతినిధులు పరిశీలించారు. త్వరలోనే ప్లాంట్ నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. వాటర్ ప్లాంట్ నిర్మాణం కోసం రూ.6లక్షలు వెచ్చిస్తున్నట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు.

కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన



పేర్లు నమోదు చేసుకుంటున్న సిబ్బంది

నాయుడుపేటటౌన్: పట్టణంలోని కుమార్ ఫంక్షన్ హాల్‌లో గురువారం జరిగిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. పెళ్లకూరు చాగణం లలితమ్మ భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్టు వారి సౌజన్యంతో తిరుపతి శ్రీవేంకటేశ్వర అరవింద నేత్రాలయా వారు నిర్వహించిన వైద్యశిబిరంలో 220 మందికి వైద్యపరీక్షలు జరిపినట్లు తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. 50 మందికి ఉచితంగా కంటి అద్దాలను అందజేస్తామన్నారు. అదేవిధంగా 48 మందికి ఉచితంగా శస్త్రచికిత్సకు ఎంపిక చేసి తిరుపతిలో చేయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ట్రస్టు మేనేజింగ్ డైరెక్టర్ చాగణం గౌరి శంకర్, సీఈఓ సీతారామయ్య పేర్కొన్నారు. ఏఓ గల్లాకృష్ణ, అరవింద్ నేత్రాలయ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సరిహద్దు జిల్లాల చెక్‌పోస్ట్ ఏర్పాటు



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

సైదాపురం: మండల కేంద్రం సమీపంలోని కైవల్యానది రోడ్డు వద్ద సరిహద్దు జిల్లాల చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ డీఎస్ విజయ్‌కుమార్ తెలిపారు. గురువారం ఈ చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశామని ఎస్‌ఐ పేర్కొన్నారు. అనంతరం పలు వాహనాలను తనిఖీ చేశారు. ఎస్‌ఐ మాట్లాడుతూ త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

రోడ్డుప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

నాయుడుపేటటౌన్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. మేనకూరు గ్రామానికి చెందిన కట్టా దొరస్వామి, హైమావతి(27) దంపతులు ఈనెల 19 తేదీ వారి కుమారుడికి ఆరోగ్యం సరిగ్గా లేకపోవడంతో ఆస్పత్రికి వెళ్లేందుకు బైక్‌లో నాయుడుపేటకు బయలుదేరారు. మార్గమధ్యలో నాయుడుపేట సమీపంలో బైక్ వెనుక కూర్చొని ఉన్న హైమావతి అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడింది. దీంతో ఆమెను మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందినట్లు సమాచారం అందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఓటు వినియోగించుకునేలా చర్యలు



హాజరైన అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర

- పీఓ, ఏపీఓల శిక్షణ
- రిటర్నింగ్ అధికారి హెచ్‌ఎం ధ్యానచంద్ర

వెంకటగిరి(సైదాపురం): సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి సామాన్య ఓటరు తమ హక్కును వినియోగించుకునేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్, వెంకటగిరి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి సీహెచ్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. వెంకటగిరి పట్టణంలోని విశ్వోదయ డిగ్రీ కళాశాలలో గురువారం నియోజకవర్గస్థాయి ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల సమీపిస్తున్న సమయంలో ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రతి ఒక్క అధికారి తమకు కేటాయించిన విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆయన అన్నారు. పోలింగ్ సమయంలో కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వెంకటగిరి మున్సిపాలిటీ, వెంకటగిరి రూరల్, డక్కిలి, బాలాయపల్లి మండలాలు తిరుపతి జిల్లా పరిధిలో, సైదాపురం, రాపూరు, కలువాయి మండలాలు నెల్లూరు జిల్లా పరిధిలో ఉందని ఈ మేరకు గూడూరు, ఆత్మకూరు డీఎస్పీలను ప్రత్యేక విధులకు కేటాయించినట్లు జేసీ తెలిపారు.

అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ కోదండరామిరెడ్డి, తహసీల్దార్ సాంబశివరావు, నియోజకవర్గ పరిధిలోని తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

●రాజకీయ పార్టీ నేతలతో రిటర్నింగ్ అధికారి సమీక్ష



నేతలతో సమీక్షిస్తున్న జేసీ ధ్యానచంద్ర

వెంకటగిరిరూరల్: సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల కమిషన్ సూచనల మేరకు రాజకీయపార్టీ నాయకులు ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని జాయింట్ కలెక్టర్, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి హెచ్‌ఎం ధ్యానచంద్ర పేర్కొన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం రాజకీయపార్టీ నేతలతో ఆయన సమీక్షించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రాజకీయపార్టీ నేతలు మీటింగ్‌లు, వాహనాల వివరాలు ముందస్తుగా అనుమతులకు దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు పరిశీలించి అనుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. అదేవిధంగా 16 మంది నోడల్ అధికారులను కూడా నియమించినట్లు తెలియజేశారు. రాజకీయపార్టీ నేతలు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని, అతిక్రమించిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఈ మేరకు రాజకీయనేతలు తమకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ ఈఆర్‌ఓ కోదండరామిరెడ్డి, తహసీల్దార్ సాంబశివరావు, మున్సిపల్ కమిషనర్ అబ్దుల్‌రషీద్, ఎలక్షన్ డీటీ యువరాజ్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలి



మార్లగుంటలో అవగాహన కల్పిస్తున్న పరిమళ

డక్కిలి: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కల్పలత, పరిమళ పేర్కొన్నారు. మార్లగుంట, నాగులపాడు గ్రామాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని గురువారం ఐసీడీఎస్ అధికారులు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కల్పలత, పరిమళ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా గర్భిణులు, బాలింతలు, టీహెచ్‌ఆర్ పిల్లలు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం చిన్నారుల ఆట వస్తువులను ప్రదర్శించారు.

ఎస్సీ కండ్రిగలో..

బాలాయపల్లి (డక్కిలి): నాయుడుచెరువు కండ్రిగ (ఎస్సీ కండ్రిగ)లోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ రాజేశ్వరి మాట్లాడుతూ గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రం ద్వారా ఇచ్చే పోషకాహారంతో పాటు ఆకుకూరలు తింటే ఆరోగ్యంగా ఉంటారన్నారు. పుట్టబోయే బిడ్డ కూడా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

రాపూరు: గర్భవతులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని సూపర్‌వైజర్లు రాజ్యలక్ష్మి, సౌజన్య అన్నారు. గరిమెనపెంట, గండూరుపల్లిలో పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చేపాలు, గుడ్లు పోషకాహారాన్ని సమపాళల్లో తీసుకోవాలన్నారు. తక్కువ ఖర్చుతో తయారయ్యే పౌష్టికాహారంపై దృష్టి సారించాలన్నారు. గర్భవతులు, బాలింతలు రక్తహీనత ఉంటే తప్పనిసరిగా వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో గర్భవతులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.



ఎస్సీకండ్రిగలో మాట్లాడుతున్న రాజేశ్వరి



గండూరుపల్లిలో సూచనలు ఇస్తున్న సూపర్‌వైజర్లు

ముగ్గురు దొంగల అరెస్ట్

- సెల్‌ఫోన్ దుకాణంలో చోరీ ఘటనను ఛేదించిన పోలీసులు
- నిందితులంతా పాత నేరస్తులే
- ఇద్దరి కోసం ముమ్మర గాలింపు



వివరాలు వెల్లడిస్తున్న కావలి డీఎస్పీ వెంకటరమణ

కావలి: పట్టణంలోని తుమ్మలపెంట్ రోడ్డులో సెల్‌ఫోన్ దుకాణంలో జరిగిన చోరీ కేసును ఒకటవ పట్టణ పోలీసులు ఛేదించారు. గురువారం కావలిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ ఎం.వెంకటరమణ వివరాలు వెల్లడించారు. పట్టణంలోని సెల్‌ఫోన్ దుకాణంలో ఈనెల 17న తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. షట్టర్ తాళాలు పగులగొట్టి రూ.2 లక్షల విలువైన 17 సెల్‌ఫోన్లు, రెండు బ్లూటూత్ స్పీకర్‌లు, ఒక సెక్యూరిటీ కెమెరాను చోరీ చేశారు. అనంతరం మరో రెండు దుకాణాల్లో చోరీకి విఫలయత్నం చేసి బొలెరో వాహనంలో పారిపోయారు. దొంగతనం జరిగిన విషయాన్ని గుర్తించిన సెల్‌ఫోన్ షాప్ యజమాని కావలి ఒకటవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్పీ డాక్టర్ తిరుమలేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు డీఎస్పీ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. సీసీ టీవీ ఫుటేజ్‌ను పరిశీలించారు. నాయుడుపేట ప్రాంతంలో చోరీలకు పాల్పడుతున్న పాతనేరస్తుల ముఠా పనే అనే విషయం బయటపడింది. సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా నిందితుల కదలికలపై నిఘా ఉంచారు. పక్కా సమాచారంతో చిల్లకూరు మండలం తిమ్మనగర్‌పాళేనికి చెందిన యనమల సూర్యతేజ, కోట మండలం రాఘవాపురం గ్రామానికి చెందిన చిట్టేటి వినయ్‌కుమార్, గూడూరు గాంధీనగర్‌కు చెందిన నాగేండ్ల శ్రీహరిని అదుపులోకి తీసుకున్నారు. సెల్‌ఫోన్లతోపాటు బొలెరో వాహనం, నాయుడుపేటలో చోరీ చేసిన 15 లీటర్ల వంటనూనె క్యాన్లు మూడు, కేజీ వంట నూనె ప్యాకెట్లు 32 స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న నాగరాజు, మీర్జావలి అనే మరో ఇద్దరు నిందితుల కోసం గాలింపు చేపట్టారు. కావలి ఒకటవ పట్టణ సీఐ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

హంస వాహనంపై అళఘునాథుడు

గూడూరురూరల్: పట్టణంలో వెలసియున్న శ్రీదేవి భూదేవి సమేత అళఘునాథస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వామివారు హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారికి తిరుచ్చి గ్రామోత్సవం, సాయంత్రం ఊంజలసేవ వైభవంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఉభయదాతలుగా డేగా సురేష్, సుప్రియ, ఎం.నారాయణమ్మ, బి.ధరణి వ్యవహరించారు.



హంస వాహనంపై విహరిస్తున్న స్వామివారు

పరిసరాలశుభ్రతపై అవగాహన

కోట: శ్రీ ప్రగతి డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం కోట మండలం చంద్రశేఖరపురంలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలోని వీధులను శుభ్రపరిచి రోడ్లకు ఇరువైపుల చెట్లను నాటారు. ప్రాథమిక పాఠశాల ఆవరణలో పిచ్చిమొక్కలను తొలగించారు. ర్యాలీ నిర్వహించి ప్రజలకు పరిశుభ్రత, పచ్చదనంపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ కిషోర్, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ వెంకయ్య పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

వెంకటగిరిరూరల్: వెంకటగిరిలోని పాఠశాలలు సమయపాలన పాటించాలని అలా లేని పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని ఎంఈఓ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వేసవికాలం కారణంగా ప్రభుత్వం నిబంధనల మేరకు ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పాఠశాల నిర్వహణ కొనసాగించాలన్నారు. కొన్ని ప్రైవేటు పాఠశాలలు సాయంత్రం 5గంటల వరకు నిర్వహణ కొనసాగిస్తున్నట్లు సమాచారమన్నారు. ఈ మేరకు ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

నేడు వేలం పాటలు

డక్కిలి: మండలంలోని వెలుగొండలు కింద ఆముదూరు పంచాయతీలోని కొలితోటలో వెలిసియున్న చెంచమ్మ ఆలయం వద్ద వివిధ హక్కుల లీజు కోసం శుక్రవారం మధ్యాహ్నం 12.05 గంటలకు బహిరంగ వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ ఏవీ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఆసక్తి గల వారు ఆలయంలోని కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. లీజు కాలపరిమితి ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2025 మార్చి 31 వరకు ఉంటుందని ఈ ప్రకటనలో పేర్కొన్నారు.

కలువాయి మండల సభ రేపు

కలువాయి: కలువాయి మండల సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు మండల కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీఓ ప్రభాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. తాగునీరు, పారిశుద్ధ్యం, హౌసింగ్, ఉపాధి, వైఎస్సార్ క్రాంతి పథం, ఇరిగేషన్, రహదారులు, భవనాలు, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖలపై సమీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

కండలేరులో 8.530 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం 8.530 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు.హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 500 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 20, హైలెవల్ కాలువకు 115, లోలెవల్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కష్టపడిన వారికి గుర్తింపు ఉంటుంది

– ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ



మేరిగ మురళీధర్‌తో నేతలు

గూడూరురూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం కోసం కష్టపడి పనిచేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్సీ, గూడూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మేరిగ మురళీధర్ అన్నారు. పట్టణంలోని 2వ వార్డు ఇన్‌చార్జి ఎస్.కె.బాబు ఆధ్వర్యంలో ముస్లిం నేతలు గురువారం రాత్రి సనత్‌నగర్‌లోని మేరిగ నివాసంలో ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్‌ను కలుసుకున్నారు. వార్డులో పార్టీ పరిస్థితి, మెజార్టీ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మేరిగ మురళీధర్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ప్రమాణస్వీకారం చేస్తారని తెలిపారు. గూడూరు నియోజకవర్గం నుంచి తనను ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో గెలిపించి అసెంబ్లీకి పంపి జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా అందించాలని కోరారు. నేతలు అన్వర్‌బాషా, యూసుఫ్, సాహుల్ పాల్గొన్నారు.

ప్రిసైడింగ్ అధికారులదే కీలకపాత్ర



శిక్షణ ఇస్తున్న ఆర్డీఓ కిరణ్‌కుమార్

– రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ కిరణ్‌కుమార్

గూడూరురూరల్: ఎన్నికల నిర్వహణలో ప్రిసైడింగ్ అధికారులదే కీలకపాత్ర అని రిటర్నింగ్ అధికారి, గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో గురువారం నియోజకవర్గంలోని ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు హ్యాండ్ బుక్ చదివి పూర్తి అవగాహనతో పక్కాగా ఎన్నికల నిర్వహణ చేపట్టాలని సూచించారు. 2024 సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో పీఓల పాత్ర చాలా కీలకమని పేర్కొన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు ఎన్నికలు కొత్తగా చూడాలని, ఈసారి ఎన్నికల్లో పలు కొత్త అంశాలు, సూచనలు ఉన్నాయని, పూర్తిగా హ్యాండ్ బుక్ చదివి అవగాహన కలిగి ఉండాలన్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు మాత్రమే పోలింగ్ కేంద్రంలో పీఓలు విధులు నిర్వర్తించాలని సూచించారు. మాక్ పోలింగ్ జరపకుండా ఎట్టి పరిస్థితుల్లో పోలింగ్ ప్రారంభించకూడదని, ఉదయం 7 గంటల కల్లా పోలింగ్ ప్రారంభించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉంటే వెంటనే సంబంధిత సెక్టార్ అధికారికి, రిటర్నింగ్ అధికారికి తెలియజేయాలని కోరారు. ఈవీఎంలు, పోలింగ్ కేంద్రాల్లో సమస్యలు ఉంటే సెక్టోరియల్ అధికారికి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎన్నికల విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు ఉంటాయని, బాధ్యతగా పనిచేయాలని కోరారు. డిప్యూటీ కలెక్టర్ సీఎస్ నాయుడు, మాస్టర్ ట్రైనర్స్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఇంటింటి ప్రచారం



ఓట్లను అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

కలువాయి: వైఎస్సార్‌సీపీ ఇంటింటి ప్రచారంలో భాగంగా గురువారం కలువాయి మండలం బాలాజీరావుపేటలో ప్రచారం నిర్వహించారు. కలువాయి జెడ్పీటీసీ సభ్యుడు అనిల్‌కుమార్‌రెడ్డి నాయకత్వంలో పార్టీ శ్రేణులు గ్రామంలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఇచ్చిన హామీలలో 99 శాతం అమలు చేసిన జగనన్నను మరోమారు ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు మద్దతు ఇవ్వాలని ఓటర్లను అభ్యర్థించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి తిరుపతి వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి మద్దెల గురుమూర్తి, వెంకటగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిలను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. పార్టీ మండల కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు ఆర్.లక్ష్మీదేవి, సర్పంచ్ సోమల సురేష్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు ఎంపీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బందికి శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న నోడల్ ఆఫీసర్ చెన్నయ్య



హాజరైన ఎన్నికల సిబ్బంది

సూళ్లూరుపేట: మే నెలలో నిర్వహించనున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి సూళ్లూరుపేట నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన 304 పోలింగ్ కేంద్రాల సిబ్బందికి స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లు ఇతర సిబ్బందికి సోషల్ వెల్ఫేర్ అధికారి, నోడల్ ఆఫీసర్ చెన్నయ్య శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా సూళ్లూరుపేట రెవెన్యూ డివిజన్ అధికారి చంద్రముని, ఆరు మండలాల తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు ఎన్నికల సిబ్బందికి శిక్షణనిచ్చారు. తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం, నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి మండలాలకు చెందిన ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు

–గూడూరు డీఎల్‌డీఓ వాణిరెడ్డి



వెలికల్లు సచివాలయంలో డౌన్‌లోడ్ యాప్‌లను చూపిస్తున్న ఉద్యోగులు

డక్కిలి: ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని గూడూరు డీఎల్‌డీఓ వాణిరెడ్డి అన్నారు. మండలంలోని వెలికల్లు సచివాలయాన్ని గురువారం ఆమె సందర్శించారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని పక్కాగా అమలు చేయాలని సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో రాజకీయపార్టీ బ్యానర్లు, ఫ్లెక్సీలు ఉండకూడదన్నారు. అలసత్వం ప్రదర్శిస్తే మాత్రం కఠిన చర్యలు తప్పవన్నారు. అనంతరం వెలికల్లులో ఉన్న ఆధార్ కేంద్రాన్ని కూడా పరిశీలించారు. ఎంపీడీఓ లీలా మాధవి, సూపరింటెండెంట్ అనురాధ, పంచాయతీ కార్యదర్శి నరసింహులు ఉన్నారు.